క్లుప్తంగా

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి



వైద్యాధికారి సునీత

రోలుగుంట: వేసవిలో ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని బుచ్చింపేట పీహెచ్‌సీ వైద్యురాలు సునీత తెలిపారు. శుక్రవారం ఆమె వేసవిలో ప్రబలే రోగాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాట్లాడారు. ఎండబారిన పండకుండా ప్రతి ఒక్కరూ తలపై టోపీ వాడడం మంచిదన్నారు. పొలాలకు వెళ్లే రైతులు తలపాగా ధరించాలన్నారు.

అర్హులైన విద్యార్థులకు వసతి గృహాల్లో సీట్లు

కె.కోటపాడు: వచ్చే విద్యా సంవత్సరానికిగాను బీసీ వసతి గృహాల్లో అర్హులైన విద్యార్థులకు సీట్లను మంజూరు చేయనున్నట్లు చోడవరం ఏబీసీడబ్ల్యూవో ఎం.నరసింహులు తెలిపారు. స్థానిక బి.సి బాలుర వసతిగృహాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కె.కోటపాడు, కొరువాడ బి.సి బాలుర వసతిగృహాల్లో మూడు నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు అవకాశం కల్పిస్తామన్నారు. కె.కోటపాడులోని కళాశాల బి.సి బాలుర వసతి గృహంలో కళాశాల విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామన్నారు. ఆయన వెంట వసతి గృహాధికారులు నాగభూషణం, కె.వి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

135 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి నిర్మల

కె.కోటపాడు: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ప్రజల చెంతకే వెళ్లి వైద్య సేవలందిస్తున్నట్లు చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల తెలిపారు. శుక్రవారం రొంగలి నాయుడుపాలెంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 135 మంది రోగులను ఆమె పరీక్షించారు. బి.పి, సుగర్ పరీక్షలతోపాటు గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. వైద్యం పొందే పరిస్థితి లేని 12 మందికి ఇళ్లకు వెళ్లి ఆరోగ్య సేవలందించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బి.రాము, హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న ప్రిన్సిపాల్ సాయికుమార్

రావికమతం: ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు కొత్తకోట కాలేజీలో ప్రత్యేక తరగతులు ఈ నెల 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్నారు. వీరి పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రతి సబ్జెక్టు విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యేందుకు గానూ ప్రత్యేకమైన స్టడీ మెటీరియల్‌ను తయారు చేసింది. వీటిని ప్రిన్సిపాల్ సాయికుమార్ శుక్రవారం వారికి పంపిణీ చేశారు. ఇక్కడికి వచ్చే విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని వివరించారు.

అపరిచితుల సంచారంపై సమాచారం ఇవ్వండి



మాట్లాడుతున్న హెచ్‌సీ శ్రీనివాసరావు

నర్సీపట్నం: నివాస ప్రాంతాల్లో అపరిచితులు ఎవరు సంచరించినా పోలీసులకు సమాచారం అందించాలని సబ్ డివిజన్ క్రైమ్ స్పాట్ ఇన్‌చార్జి హెచ్.సి. శ్రీనివాసరావు సూచించారు. మున్సిపాలిటీ శివపురంలో చోరీలు, దిశ యాప్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోరీలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను వెంటనే ఛేదించడానికి అవకాశం ఉంటుందన్నారు. దిశ యాప్‌పై మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆపద సమయంలో రక్షణ కవచంలా ఉపయోగపడుతుందన్నారు. సిబ్బంది భరతుడు, యుగంధరరావు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో గ్రామాల అభివృద్ధి

- కలిగొట్ల పంచాయతీలో రూ. 3.50 కోట్లతో అభివృద్ధి పనులు
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



కలిగొట్ల శివారులో రోడ్డు నిర్మాణానికి ఇంజినీరింగ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి



దిబ్బగరువులో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలతోపాటు మౌలిక సదుపాయాల కల్పనతో అన్ని గ్రామాలు అభివృద్ధి బాట పట్టాయని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. కలిగొట్ల పంచాయతీ శివారు బందారుపాలెం, దిబ్బగరువు, రాయపురెడ్డివారి కల్లాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ప్రతీ ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలిగొట్ల గ్రామ సచివాలయం పరిధిలో రూ. 3.50 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. వీటిలో కొన్ని పూర్తి కాగా మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. కలిగొట్ల పంచాయతీ పరిధిలో జలజీవన్ మిషన్ నిధులు రూ.1.50 కోట్లతో చేపట్టే ప్రతీ ఇంటి కి కుళాయి ఏర్పాటు పనులను త్వరగా పూర్తి చేయా లని సంబంధిత అధికారులను ఆదేశించారు. బందారుపాలెం తదితర శివారు గ్రామాలకు రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించిన ఇంజినీరింగ్ సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. అన్ని వర్గాల సంక్షేమ ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్ పై ప్రజలు అపార విశ్వాసంతో ఉన్నారన్నారు. గడప గడపలో ఆప్యాయంగా పలకరించినప్పుడు వారు అందుకున్న పథకాలను చిరునవ్వుతో చెప్పడమే ఇందుకు నిదర్శనమన్నారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఏవో వై. కాంతమ్మ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, సర్పంచ్ గొర్రుపోటు సుధారాణి, ఎంపీటీసీ రుత్తల లక్ష్మి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి చింతు రాము, మాజీ ఎంపీటీసీ గూనూరు కొండబాబు, గొర్రు పోటు పార్థసారథి, రుత్తల రాంబాబు పాల్గొన్నారు.

కలిగొట్లలో రెండో రోజు నేడు

కలిగొట్లలో రెండో రోజు శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు నిర్వహిస్తారని పార్టీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభం కానుందన్నారు.

అచేతన బాధిత యువతికి ప్రభుత్వ విప్ భరోసా

- రూ.10 వేల పింఛన్ మంజూరుకు అధికారులకు ఆదేశం
- తట్టబంద, కన్నూరివారి పాకలలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



మంచంపై లేవలేని స్థితిలో ఉన్న లక్ష్మిని పరామర్శిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

రావికమతం: అంతుచిక్కని వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమైన మోటూరు లక్ష్మి(20)కి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ భరోసా ఇచ్చారు. ఆమె దీనస్థితిని చూసి చలించిపోయారు. తక్షణమే రూ.10 వేల పింఛన్ మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శుక్రవారం ఆయన తట్టబంద, కన్నూరివారి పాకల గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లారు. సంక్షేమ అమలు తీరుతోపాటు ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో బాధిత లక్ష్మి చిన్నప్పటి నుంచి అంతుచిక్కని వ్యాధితో మంచం పైనే ఉంటోందని వైద్య ఖర్చులకు నెలనెలా వేలాది రూపాయలు అవుతున్నాయని ఆమె కుటుంబీకులు ధర్మశ్రీ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై వెంటనే ఎంపీడీవో వెంకన్నబాబుతో మాట్లాడి లక్ష్మికి రూ.3 వేల పింఛన్ మాత్రమే వస్తుందని తెలుసుకున్నారు. తక్షణమే రూ.10 వేల పింఛన్ అందించాలని ఆదేశించారు. దీంతో లక్ష్మి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. తట్టబందలో రామాలయం నుంచి కొండ గెడ్డ వరకు సీసీ డ్రైనేజీ నిర్మించాలని, ఇంటింటికీ కుళాయి పనులు చేపట్టాలని ధర్మశ్రీని గ్రామస్తులు కోరారు. శ్మశానంలో బోరు ఏర్పాటు చేయాలని, తట్టబంద సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరాకు ఆదేశాలివ్వాలని కన్నూరువారి పాకల వద్ద ప్రజలు కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. అధికారుల దృష్టికి రాని సమస్యలను ఇంటింటికీ తిరిగి తెలుసుకుని పరిష్కరించడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం వైఎస్సార్ యూత్ యువకుల అభ్యర్థన మేరు క్రికెట్ కిట్ కొనుగోలుకు రూ.5 వేలను ధర్మశ్రీ అందించారు. కార్యక్రమంలో చోడవరం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకుడు కోలా గురువులు, ఎంపీపీ పైల రాజు, గ్రామ మాజీ సర్పంచ్, చోడవరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజాన నర్సింహులు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, ఎంపీటీసీ పిల్లా శేషుబాబు, ముఖ్య నాయకులు రుత్తల బాపు నాయుడు, కోసూరి మంజు పాల్గొన్నారు.

వేదిక నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ సత్యనారాయణ

మాకవరపాలెం: ఎంపీ నిధులతో చేపట్టనున్న వేదిక నిర్మాణానికి ఎంపీపీ రుత్తల సత్యనారాయణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో సాంస్కృతిక, తదితర కార్యక్రమాలు చేపడుతుంటారు. ఈ నేపథ్యంలో ఇక్కడ వేదిక నిర్మాణానికి స్థానిక నేతలు, గౌతమి లలితకళా శిక్షణ కేంద్రం సభ్యుల విజ్ఞప్తి మేరకు అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు పనులను చేపట్టేందుకు ఎంపీపీ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, గౌతమి లలిత కళా శిక్షణ కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు, శేషగిరిరావు, గౌరవాధ్యక్షుడు రాజు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణం ప్రారంభించాలి

మాకవరపాలెం: ఆలయ నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని దేవదాయ శాఖ డీఈ సైద కమిటీ సభ్యులకు సూచించారు. తామరంలో రామాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆయన ఆలయాన్ని నిర్మించే స్థలాన్ని పరిశీలించారు. పనులను వెంటనే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత గొంతిన హరిబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట



కల్యాణంలో పాల్గొన్న విశ్వబ్రాహ్మణులు

మాకవరపాలెం: వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. స్థానిక కొత్తవీధిలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఆలయాన్ని నిర్మించారు. ఈ నేపథ్యంలో మూడు రోజులుగా ఆలయం వద్ద పూజలు, హోమాలు నిర్వహించి శుక్రవారం స్వామివారి విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్టించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో విశ్వబ్రాహ్మణులు, స్థానికులు, ప్రజాప్రతినిధులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అనంతరం సాయంత్రం వరకు ఆలయంలో స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు పాల్గొని కనులారా వీక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంతం ఆదినారాయణ, ఆరిపాక శ్రీనివాసరావు, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం రేపు

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1991 నుంచి 1996 వరకు విద్యనభ్యసించిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. ఇక్కడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉదయం 8 గంట ల నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరవుతారని, పూర్వ ఉపాధ్యాయులకు సత్కారం చేస్తారన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

రావికమతం: కొత్తకోట సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ సురేష్‌బాబు శుక్రవారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో బ్రేకర్స్ మరమ్మతులు, సబ్ స్టేషన్ అప్‌గ్రేడేషన్ చేయనున్న నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించాలని సూచించారు.

'మోడల్'లో ప్రవేశాలకు దరఖాస్తులు

రావికమతం: మరుపాక మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సత్య సునీల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన స్కూల్‌లో ఐదో తరగతి పాసైన విద్యార్థులు ఏపీఎంఎస్‌డాట్ ఏపీడాట్ గవర్నమెంట్ డాట్ ఇన్‌లో దరఖాస్తు చేసుకుని, వాటి ప్రింట్ అవుట్‌లను ఈ నెల 9 నుంచి 25వ తేదీలోగా అందజేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.75, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150 ఫీజు చెల్లించాలన్నారు. జూన్ 11న అర్హత పరీక్ష ఉంటుందన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం



స్పందన కమిటీ సమావేశంలో తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్‌ఐ

కె.కోటపాడు: సకాలంలో సమస్యలను పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జె.రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో స్పందన త్రిసభ్య కమిటీ ఎదుట స్పందన సమస్యలకు పరిష్కారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమేష్‌బాబు మాట్లాడుతూ స్పందనలో సకాలంలో పరిష్కారానికి నోచుకోని, ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందని ఫిర్యాదులను స్పందన త్రిసభ్య కమిటీ ఎదుట మేలైన పరిష్కారాన్ని చూపనున్నట్లు తెలిపారు. రెవెన్యూ, పంచాయతీరాజ్‌కు సంబంధించినవి రెండు దరఖాస్తులు చొప్పున, పోలీస్‌కు సంబంధించిన ఒక స్పందన దరఖాస్తుకు పరిష్కారం చూపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.శచీదేవి, ఎస్‌ఐ ధనుంజయ్, రామకృష్ణ, మండల సర్వేయర్ శ్రీరామచంద్రమూర్తి, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

దేవరాపల్లి: స్పందనలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు తక్షణ పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్ ఎం. లక్ష్మి తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఎస్‌ఐ డి. నాగేంద్రతో కలిసి గురువారం సమావేశమయ్యారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందనలో వచ్చిన సమస్యలపై చర్చించారు. స్పందనలో వస్తున్న సమస్యల పట్ల అలసత్వం ప్రదర్శించకుండా వెన్వెంటనే పరిష్కార మార్గం చూపేలా సమష్టిగా కృషి చేద్దామన్నారు. దీంతో స్పందన పట్ల ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందన్నారు.

వేసవి దుక్కుల్లో రైతులు నిమగ్నం



ట్రాక్టర్‌తో దుక్కులు చేసుకుంటున్న రైతులు

రోలుగుంట: మండల రైతాంగం వేసవి దుక్కుల్లో నిమగ్నమైంది. ఖరీఫ్ వరి కోతల తర్వాత మెట్ట భూములు మినహా పల్లపు భూములు ఖాళీగానే ఉన్నాయి. సరైన వర్షాలు లేక దుక్కులకు అనువైన కాలం కాక ఖాళీగా ఉంచారు. గత వారంలో అకాల వర్షాలతో దుక్కులకు అనువైన తడులు భూముల్లో ఏర్పడ్డాయి. దీంతో రైతులు ఖాళీగా ఉన్న పల్లం, మెరక భూముల్లో దుక్కు పనులు చేపట్టారు. భూమి గుల్లబారడంతోపాటు క్రిములు నశించి సాగుకు అనుకూలంగా ఉంటుంది. రెండు రోజులుగా రోలుగుంట, కొమరవోలు, వడ్డిప, కొండపాలెం, తదితర గ్రామాల్లో దుక్కుల పనులు జోరుగా సాగుతున్నాయి. లోదుక్కులు చేసుకుంటే సాగుకు మేలని ఏవో ఎస్.విజయలక్ష్మి రైతులకు సూచించారు. ట్రాక్టర్ల కన్నా నాగలి దుక్కులే ఉపయోగకరంగా ఉంటాయన్నారు.

ఎం. కోడూరులో పింఛన్ల పంపిణీ



ఎం.కోడూరులో పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు



పింఛన్లు అందిస్తున్న సర్పంచ్ లక్ష్మణమ్మ, ఎంపీటీసీ శ్రీను

మాడుగుల రూరల్: ఎం. కోడూరులో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు ఆరుగురు లబ్ధిదారులకు నూతన పింఛన్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ పింఛను కానుక కింద అర్హులందరికీ పింఛన్లు అందిస్తున్నామన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజేశ్, గ్రామ శాఖ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చుక్కపల్లిలో..

చీడికాడ: చుక్కపల్లిలో సర్పంచ్ మజ్జి లక్ష్మణమ్మ శుక్రవారం కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు సహకారంతో అభయ హస్తం పింఛన్లు–8, దివ్యాంగు పింఛన్ ఒకటి మంజూరైనట్లు ఆమె తెలిపారు. ఎంపీటీసీ సుంకర శ్రీను, సచివాలయం కన్వీనర్ బి.వి. రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పెంటకోట ఈశ్వరరావు, మజ్జి సత్తిబాబు, సకలా రమణ తదితరులు పాల్గొన్నారు.

15 విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

దేవరాపల్లి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎ. కొత్తపల్లిలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకువచ్చిన విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని సర్పంచ్ చింతల సత్యవెంకటరమణ, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి తెలిపారు. ఎ. కొత్తపల్లి, చిప్పడపాలెం, పండూరుపాలెం గ్రామాల్లో నూతనంగా 15 విద్యుత్ స్తంభాలు వేశారన్నారు. చిప్పడపాలెంలో లో వోల్టేజీ సమస్యను అధిగమించేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆ శాఖ సిబ్బంది సైతం శుక్రవారం ఏర్పాటు చేశారన్నారు. ఇళ్లను ఆనుకుని ప్రమాదకరంగా ఉన్న తీగలను సరిచేశారు. ఈ సమస్యల డిప్యూటీ సీఎంకు గ్రామస్తుల తరుపున సర్పంచ్, వైస్ ఎంపీపీ కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి

నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్



ఎస్‌ఐ లక్ష్మీనారాయణతో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రవీణ్‌కుమార్

నాతవరం: రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించామని నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్ ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో ప్రధాన సమస్యలను ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ డివిజన్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు పలు చర్యలు చేపట్టామన్నారు. తరుచూ ప్రమాదాలు జరిగే చోట బారికేడ్లు ఏర్పాటు, అతివేగంతో వెళ్లే వాహనాలను నిత్యం తనిఖీలు చేయడం వంటి చర్యలు చేపట్టామన్నారు. డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. జనసంచారం అధికంగా ఉండే ప్రధాన కూడళ్లలో ఇప్పటికే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. డివిజన్‌లో ఇంకా ఎక్కడెక్కడ ఇవి అవసరమో గుర్తించి దాతలు సాయంతో ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. తద్వారా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారితోపాటు గంజాయి స్మగ్లర్లను, రోడ్డు ప్రమాదాలకు కారకులను పట్టుకునేందుకు వీలవుతుందన్నారు. గ్రామ పండగ సమయాల్లో కోడిపందేలు వంటి వాటిపై దృష్టి సారించామన్నారు. గ్రామ సచివాలయ పోలీసులు మారుమూల గ్రామాల్లో సంఘటనలను వెంటనే తమ దృష్టికి తెస్తున్నారన్నారు. స్పందన ఫిర్యాదులపై తక్షణమే స్పందించేలా ఎస్‌ఐలకు ఆదేశించామన్నారు.

ఆత్మరక్షణకు తైక్వాండో



వడ్డాదిలో తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న రాంబాబు

బుచ్చెయ్యపేట: తైక్వాండో శిక్షణ తీసుకుంటే ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని జెడ్పీటీసీల ఫోరం ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు దొండా రాంబాబు తెలిపారు. శుక్రవారం మేజర్ పంచాయతీ వడ్డాది కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అమ్మ హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తైక్వాండో శిక్షణను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు ఉచితంగా తైక్వాండో శిక్షణ ఏర్పాటు చేసి మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తున్న అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సేవా సంస్థను అభినందించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించేలా ఈ నెల 20వ తేదీ వరకు రోజూ ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఉచితంగా తైక్వాండో శిక్షణ ఇస్తామని సంస్థ సిబ్బంది తెలిపారు. బుచ్చెయ్యపేట, మాడుగుల, చోడవరం, రావికమతం తదితర మండలాల విద్యార్థులు శిక్షణలో ఉత్సాహంగా పాల్గొన్నారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, మాజీ ఎంపీపీ బత్తుల తాతయ్యబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, మాజీ వైస్ ఎంపీపీ దాడి సూరినాగేశ్వరరావు, సర్పంచ్‌లు ముచ్చకర్ల శ్రీను, సీతా బుజ్జి, నాయకులు సయ్యపు రెడ్డి సత్యనారాయణ, దొండా రమేష్, నరేష్ తదితర్లు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్య వైఖరి తగదు



మాట్లాడుతున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం: గ్రామ సచివాలయాల ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు సేవలందేలా దృష్టి సారించాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తెలిపారు. ఆయన తన కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్షించారు. కొన్ని సచివాలయాల్లో ప్రజల పట్ల సంబంధిత ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లుగా తన దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారి పని తీరు మార్చాలని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావుకు సూచించారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో బాధ్యతగా పని చేయాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. మండలంలో ఎక్కడైనా బోర్లు, తాగునీటి పథకాలు పని చేయకపోతే, వాటిని బాగు చేసేందుకు మండల పరిషత్ నుంచి సామగ్రి కొనుగోలు చేశామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ మంజూరు చేసిన నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయాలన్నారు. మిగిలిన గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం త్వరలో నిర్వహిస్తారన్నారు. ఎంపీడీవోతో పాటు కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, ఎంపీటీసీ సభ్యుడు తమరాన లోవకృష్ణ ,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాలిసెట్ మాక్ టెస్టు రేపు

మాడుగుల రూరల్: సృజనవాణి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వి.వి. అగ్రహారంలో ఈ నెల 7న పాలిసెట్ నమూనా పరీక్ష నిర్వహించనున్నట్లు సంస్థ సమన్వయకర్తలు కె. జానీ, ఆర్. రామారావు శుక్రవారం తెలిపారు. ఇక్కడ గత నెల 17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరైన వంద మంది విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. పాలిసెట్ మాక్‌టెస్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. వీరితోపాటు ఇక్కడ శిక్షణ పొందని విద్యార్థులు సైతం ఈ టెస్ట్‌లో పాల్గొనవచ్చని సూచించారు. పూర్తి వివరాలకు 7989947349 సంప్రదించాలన్నారు.

ఉపాధి పనుల బాట



ఉపాధి పనులు చేసి ఇంటికి వెళ్తున్న కూలీలు

గొలుగొండ: చోద్యంలో వేతనదారులు ఉపాధి పనులకు ఉత్సాహంగా హాజరవుతున్నారు. ఇక్కడ 270 మంది కూలీలు తెల్లవారు 6 గంటలకు పనులకు వెళ్లి మరలా 10 గంటలకు ఇంటికి చేరుకుంటారు. ఏటా గ్రామంలో కూలీలు నూరు శాతం పనులకు హాజరు కావడం విశేషం. గ్రామంలో 713 మంది కూలీల్లో నూరుశాతం మహిళలు ఈ పనులు వెళ్తున్నారు. ఎండైనా, వానైనా రెండు కిలో మీటర్ల మేర నడిచి వెళ్లి పనులు చేసి వస్తుంటారు.